దోమ కుట్టినట్లయినా లేదు..

జనావాసాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లల్లో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. సరైన నిర్వహణ లేకపోవడంతో మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండగా.. స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అటు ప్లాట్ల యజమానులు పట్టించుకోక.. ఇటు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి దోమలకు నిలయంగా మారాయి. విష సర్పాలతో అనుక్షణం భయపడాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇవ్వడం, వారు స్పందించకపోవడం పరిపాటిగా మారింది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికార యంత్రాంగం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి



సెయింట్ మేరీస్ స్కూల్ వెనుక భాగంలో పెరిగిన పిచ్చి చెట్లు, (ఇన్‌సెట్) ప్రమాదకరంగా ఉన్న గుంత

ఖాళీ ప్లాట్లు.. ప్రజలకు పాట్లు

- పిచ్చిమొక్కలు, మురుగు నిల్వలతో అవస్థలు
- విష కీటకాలతో ఆందోళనలో ప్రజలు
- నోటీసులు ఇస్తున్నా చర్యలు శూన్యం

ప్రమాదకరంగా చర్చి గుంతలు

ఖమ్మం నగరంలోని సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణలోని స్కూల్ వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలం అడవిని తలపిస్తోంది. ఈ స్థలంలో చర్చి నిర్మాణం కోసం గతంలో గుంతలు తవ్వారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అక్కడ చర్చి నిర్మాణం జరగలేదు. ఇక ఆ గుంతలు అలానే వదిలేయడంతో పిచ్చి మొక్కలు పెరిగి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కాగా, పిచ్చి మొక్కలు పెరగడంతో తవ్విన గుంతలు కనబడక అందులో గేదెలు పడి చనిపోయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే ఈ గుంతలను పూడ్చాలని డిమాండ్ చేస్తున్నారు.

శిథిలావస్థలో ఇళ్లు.. పిచ్చి చెట్లతో స్థలాలు..



కోనాయిగూడెంలో పెరిగిన పిచ్చి చెట్లు

పాలేరు నియోజకవర్గంలో ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని చాలా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వదిలేయడంతో ఆ ఇంటి చుట్టు పిచ్చి మొక్కలు పెరిగి విష కీటకాలకు వేదికగా మారాయి. కొంతమంది ఖాళీ స్థలాలను కొని నిర్లక్ష్యంగా వదిలివేయడంతో సమస్య పునరావృతం అవుతోంది. జనావాసాల మధ్య ఖాళీ ప్లాట్లు ఉండడంతో ఇళ్లలోకి విష కీటకాలు వస్తున్నాయని, మురుగు నిల్వలతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోర్డులకే పరిమితం..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని 3వ డివిజన్ పరిధిలో మున్సిపాలిటీ స్థాపించిన హెచ్చరిక బోర్డులు అక్కడక్కడా కనిపిస్తున్నా, ఖాళీ స్థల యజమానులు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. రూ.లక్షలు ధారపోసి ఇంటి నిర్మాణం చేసుకుంటే పక్కన ఖాళీ స్థలాల్లో మురుగు, కంప అడ్డంకిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఓ వైపు మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా, వార్డుల్లో ప్రచారం చేయించినా స్థల యజమానులకు మాత్రం చీమ కుట్టినట్లయినా లేదు. ఎక్కడా పట్టించుకుని శుభ్రం చేయించిన దాఖలాలు కనిపించడం లేదు. స్థానికుల రోగాల బారిన పడకుండా ఉండేలా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగు, కంప లేకుండా గఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతానా ఉంది. పరిస్థితి ఏర్పడుతుంది.



ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చర్యలు తీసుకుంటాం..



పంచాయతీల్లోని ఖాళీ ప్లాట్లలో చెత్తాచెదారాన్ని తొలగించాలని యజమానులకు తెలియజేస్తాం. పట్టించుకోకపోతే నోటీసులు ఇచ్చి పంచాయతీ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శిథిలావస్థ ఇళ్ల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

అవగాహన కల్పించాలి..



యజమానులకు ఖాళీ ప్లాట్ల వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అవసరమైతే ప్రభుత్వ ఖర్చులతో బాగు చేసేలా చర్యలు చేపట్టాలి.

– గుండు మహేష్, బోదులబండ

ప్రమాదకరంగా గుంతలు



ఖమ్మం నగరంలోని సెయింట్ మేరీస్ స్కూల్ వెనుక భాగం ఖాళీ స్థలంలో చర్చి నిర్మాణం కోసం గుంతలు తవ్వారు. అనుమతులు రాక నిర్మాణం ఆగిపోవడంతో గుంతలను అలాగే వదిలేశారు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగి గుంతలు కనపడకపోవడంతో అందులో పశువులు పడి మరణించాయి. వెంటనే గుంతలను పూడ్చాలి.

– పిల్లి విజయ్‌పాల్, మాజీ కౌన్సిలర్, ఖమ్మం

స్థలాన్ని శుభ్రం చేయాలి..



నగరంలోని పాఠశాల వెనుక అంతా పిచ్చి మొక్కలు, గడ్డి, పొదల్లతో అడవిని తలపిస్తోంది. దీనిలో పాములు, కీటకాలు ఆవాసాలను ఏర్పరుచుకుంటున్నాయి. ఈ స్థలాన్ని మున్సిపల్ అధికారులు వెంటనే శుభ్రం చేయించి స్థానికుల ఇబ్బందులను తొలగించాలి. అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలి.

– సిరిగిరి శ్రీను, ఖమ్మం

క్లుప్తంగా

ఆడిట్ తనిఖీలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పాఠశాలల్లో జరుగుతున్న వివిధ పనులు, పాఠశాలల నిర్వహణపై బుధవారం నగరంలోని పలు పాఠశాలల్లో ఆడిట్ బృందం తనిఖీ చేసింది. నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల మండలాలకు చెందిన పాఠశాలల హెచ్‌ఎంలు హాజరు కాగా... జలగంనగర్ పాఠశాలలో సైతం తనిఖీ చేశారు.

మహాసభలకు ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 8, 9, 10వ తేదీల్లో కలకత్తాలో జరిగే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) మహాసభలకు జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం లభించింది. ఈమేరకు బుధవారం జాతీయ కౌన్సిల్ సభ్యులు చావా దుర్గాభవాని, టీఎస్ యూటీఎఫ్ నాయకులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు తరలి వెళ్లారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 21వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ బోర్డు ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. బుధవారం డివిజన్‌లోని పార్కులో ఇంటి నిర్మాణం కోసం బ్యాంక్ లింకేజీ ద్వారా రుణ సదుపాయం గురించి అవగాహన కల్పించడంతో పాటు లబ్ధిదారుల అనుమానాలను నివృత్తి చేశారు.

జవాన్‌పై సస్పెన్షన్ వేటు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 38వ డివిజన్ జవాన్ ఎం.బంగారిను సస్పెండ్ చేస్తూ కేఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. విధుల్లో సక్రమంగా లేకపోవడం, ట్రేడ్ లైసెన్సుల నమోదులో అలసత్వం, వర్కర్లపై దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై సస్పెండ్ చేసినట్లు సమాచారం. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు వెల్లడించారు.

ఉచిత మట్టి పరీక్షలు..

నేలకొండపల్లి: మండల కేంద్రంలో రైతు మిత్ర ఆధ్వర్యాన బుధవారం ఉచితంగా మట్టి, నీటి నమూనా పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ ఎం.రాధ మాట్లాడుతూ.. రైతులు పొలంలో నేల, నీరులో ఉండే ఉదజని.. సూచిక లవణ శాతాల కొలమానం కోసం పీహెచ్, ఈసీ మీటర్ల ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏఈఓ అవినాష్, పి.రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరామర్శ

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా కాంగ్రెస్ యువజన నాయకుడు తుమ్మల యుగేందర్ బుధవారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు.

డెయిరీ సముదాయం అద్దెకు టెండర్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని విజయ డెయిరీ సముదాయంలో పది షట్టర్లతో కూడిన సముదాయాన్ని అద్దెకు ఇచ్చేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రధాన రహదారి వెంట ఖాళీ స్థలం ఉండడంతో ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా సముదాయాన్ని నిర్మించినా రెండేళ్ల నుంచి ఖాళీగా వదిలేశారు. ఎట్టకేలకు అద్దెకు ఇచ్చేలా డీడీ కె.రవికుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నెలవారీ కనీస అద్దె రూ.25వేలతో పాటు 18శాతం జీఎస్టీ చెల్లించేందుకు ఆసక్తి ఉన్న వారు రూ.2వేలతో టెండర్ ఫారం కొనుగోలు చేసి రూ.20వేల ఈఎండీ డీడీ జత చేశాక సెప్టెంబర్ 3వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. వివరాలకు 91211 60540, 99598 77109 నంబర్లలో సంప్రదించాలని డీడీ తెలిపారు.

ఇండియన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ షాపింగ్ ఫెస్టివల్



ఫెస్టివల్‌లో వస్తువుల ప్రదర్శన, కొనుగోళ్లు

ఖమ్మంగాంధీచౌక్: విశిష్టమైన కలెక్షన్లతో ఇండియన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ షాపింగ్ ఫెస్టివల్-2025ను నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు జునేద్ ఇక్బాల్, అష్రఫ్ అలీ తెలిపారు. జ్యూవెలరీస్, రాజస్థానీ చెప్పులు, గాజులు, బనారస్, చాందినీ చీరలు, పెయింటింగ్స్, లక్నో ఎంబ్రాయిడరీ, కుర్తా, కార్పెట్లు, ముత్యాలు, బెడ్ షీట్స్, కశ్మీర్ డ్రెస్ మెటీరియల్, టెర్రాకోట ఉడెన్ ఫర్నిచర్, హ్యాండీ క్రాఫ్ట్ అండ్ హ్యాండ్లూమ్ వస్తువులు లభిస్తాయని తెలిపారు. డెబిట్ అండ్ క్రెడిట్ కార్డు కొనుగోలుపై 5 శాతం డిస్కౌంట్ ఉంటుందని, ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.

పెద్దాస్పత్రిలో పారిశుద్ధ్యం అధ్వానం..

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. కార్మికుల సమ్మెతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా ఇన్‌పేషంట్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీ, ఐసీయూ తదితర విభాగాల్లో కార్మికులు లేక మెడికల్ వేస్ట్ పేరుకుపోయింది. మరుగుదొడ్లకు వెళ్తే నీళ్లు రావట్లేదని రోగులు, వారి సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి దుర్గంధంగా మారడంతో అధికారులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు కార్మికులను పంపించి కొన్ని చోట్ల చెత్తను తొలగించారు. అయితే 10 మంది మున్సిపల్ కార్మికులు వచ్చి చెత్త ఎత్తితే ఆస్పత్రి అంతా ఎలా శుభ్రం అవుతుందని పేషంట్లు ప్రశ్నిస్తున్నారు.



చెత్త తరలిస్తున్న మున్సిపల్ కార్మికులు

సమాచారం..

● **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ డెయిరీ ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు (గురువారం) ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్ పరిధిలోని పోలీసుకాలనీ, నేతాజీనగర్, ఓల్డ్ సుడా చైర్మన్ బజార్ పరిధిలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన**

ఖమ్మంమయూరిసెంటర్: పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ గురువారం నగరంలో నిర్వహించే ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ర్యాలీలు నిర్వహించారు. కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు నగరంలోని పెవిలియన్ మైదానం నుంచి జెడ్పీసెంటర్ వరకు నిర్వహించే ప్రదర్శనలో అన్నివర్గాల వారు పాల్గొనాలని కోరారు.

● **నేడు, రేపు ఎస్‌బీఐ సమావేశాలు**

ఖమ్మంగాంధీచౌక్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ వర్కింగ్ కమిటీ సమావేశాలు గురు, శుక్రవారాల్లో నగరంలోని శ్రీశ్రీ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కేఎస్ నందన్, రీజినల్ సెక్రటరీ చిన్నపరెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న కీలక పరిణామాలు, సిబ్బంది కొరత, కార్మిక చట్టాల ఉల్లంఘన, పెరుగుతున్న పనిభారం, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

అల్లీపురం వైపే టీటీడీ ఆలయం?

ఖమ్మంఅర్బన్: ఖమ్మంకు సమీపాన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అంగీకరించగా.. స్థలం ఖరారైనట్లు తెలిసింది. ఖమ్మం 15వ డివిజన్ పరిధి అల్లీపురం వైపు పరిశీలించిన స్థలంలో ఆలయ నిర్మాణానికి మొగ్గుచూపిన టీటీడీ బృందం ఒకటి, రెండు ఉత్తర్వులు పంపనున్నట్లు సమాచారం. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతితో టీటీడీ ఆధ్వర్యాన ఆలయ నిర్మాణానికి అంగీకరించగా ఇటీవల తిరుమల బృందం ఖమ్మంలోని పలు స్థలాలను పరిశీలించింది. ఇందులో అల్లీపురం వైపు భూములను అనువైనవిగా గుర్తించినట్లు తెలుస్తుండగా, సుమారు 20ఎకరాలకు పైగా కేటాయించనున్నట్లు తెలిసింది.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం స్తంభాద్రి ఆస్పత్రిలో బుధవారం విశ్రాంత పోలీసు అధికారులకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణల ఆధ్వర్యాన గుండె సంబంధిత ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పేర్ల హర్షతేజ వైద్య పరీక్షలు నిర్వహించి విశ్రాంత ఎస్సై వై.సంజీవరెడ్డిని పరీక్షించిన ఆయన వెంటనే బైపాస్ సర్జరీకి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. విశ్రాంత ఎస్సైలు పి.రామకృష్ణ, కె.సోమయ్య, కృష్ణ, లాల్‌బహదూర్, దేవసహాయం, ఏఎస్సైలు వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేందర్, వెంకటేశ్వరరావు, పిచ్చిరెడ్డి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి స్వాధీనం..

కామేపల్లి: గత కొన్నేళ్లుగా అక్రమణదారుడి చేతిలో ఉన్న దేవాలయ భూమిని ఎట్టకేలకు సంబంధిత దేవాలయ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గోవింద్రాల గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 173లో 1.35 కుంటలు, 138లో 9.23 కుంటలు భూమి గత కొన్నేళ్లుగా అదే గ్రామానికి చెందిన ఓ రైతు స్వాధీనంలో ఉంది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఇటీవల దేవాదాయ శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అధికారులు అందుకు సంబంధించిన భూమిలో సర్వే నంబర్లు, విస్తీర్ణం వివరాలను తెలుపుతూ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ తిరుపతిరెడ్డి బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ వేణుగోపాలచార్యులు, తోటకూర వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మోహనకృష్ణ, సాయిలలిత్, సత్యం, వీరబాబు పాల్గొన్నారు.



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్ తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టిజన్లను విద్యుత్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని, గృహజ్యోతి పథకంతో నష్టపోతున్న బిల్ కలెక్టర్లకు ఉపాధి కల్పించాలని, మీటరు రీడర్లు, ఎస్‌పీఎం, స్టోర్ అన్‌మాన్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, జేఎల్‌ఎంలకు ఏరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. బి.పుష్పవాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు, వివిధ డివిజన్లకు చెందిన సంఘ ప్రతినిధులు ఉగ్గు వెంకటేశ్వర్లు, సర్వప్రకాశరావు, గురునాథం, రాజేష్, లాలయ్య, సుధాకర్, సత్యనారాయణ రెడ్డి, సీతయ్య, కృష్ణమూర్తి, ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ గంటా శ్రీనివాస రావు, కృష్ణారావు, కమలాకర్, రామయ్య, రవి, శ్రీను, నీల, రాణి, రాధ, రాణికుమారి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించి, తన జీవితాన్నే త్యాగం చేసిన వ్యక్తి జయశంకర్ అని ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో నివాళులర్పిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, అధికారులు



ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, నేతలు



ఖమ్మం మామిళ్లగూడెం: అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు



ఖమ్మంఅర్బన్: మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఖమ్మంలీగల్: కోర్టులో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న న్యాయవాదులు

➡ **ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ కొనసాగింపు**

ఖమ్మం క్రైమ్: చట్టవిరుద్ధమైన కార్యకలాపాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్లు పేరల్లి ప్రవీణ్, పగడాల విజయ్ అలియాస్ చంటిపై పీడీ యాక్ట్ కొనసాగింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఖమ్మం ఏసీపీ రమణమూర్తి తెలిపారు. భూకబ్జాలు, బెదిరింపులతో వసూళ్లకు పాల్పడుతున్న వీరిపై ఇటీవల ఖమ్మం టూ టౌన్, అర్బన్ పోలీసుస్టేషన్‌లో సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ అమలు చేశారు. ఆపై వీరిద్దరిని చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా, పీడీ యాక్ట్‌ను అడ్వైజర్ కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేయడంతో ఏడాది పాటు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఏసీపీ తెలిపారు.

➡ **'స్మార్ట్‌కిడ్జ్' జ్యూట్ బ్యాగ్‌ల ఆవిష్కరణ**



బ్యాగ్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, కరస్పాండెంట్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యాన రూపొందించిన జ్యూట్ బ్యాగ్‌లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు గత ఐదేళ్లుగా స్మార్ట్ కిడ్జ్ ఆధ్వర్యాన జ్యూట్ బ్యాగ్‌లను తయారు చేసి అందిస్తుండడం అభినందనీయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేస్తున్నామన్నారు.

➡ **'రెజొనెన్స్ శ్రీనగర్' విద్యార్థుల సత్తా..**



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీధర్‌రావు

ఖమ్మం సహకారనగర్: సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని రెజొనెన్స్ శ్రీనగర్ డైరెక్టర్లు కె.శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించాక మాట్లాడారు. సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–12 బాలుర విభాగంలో ఎస్‌కె.ఉబైదా బంగారు పతకాన్ని, ఎస్‌కె.రిహాన్ సిల్వర్ మెడల్, అండర్–12బాలికల విభాగంలో బి.దీక్షిత, అండర్–10బాలుర విభాగంలో ఎన్.పృథ్వీరాజ్ బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

➡ **పంచాయతీ గదిలోనే పశువైద్యానికి స్పందన**



రికార్డులు పరిశీలిస్తున్న పురంధర్

సాక్షి ఎఫెక్ట్..

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో పశువైద్యశాల పనితీరుపై 'సాక్షి'లో ప్రచురితమైన ''పశువైద్యం పంచాయతీ''కథనంపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బి.పురంధర్ బుధవారం పశువైద్యశాలను పరిశీలించి భవనం సదుపాయం లేకపోవడం, మూగజీవాలకు వైద్యసేవలు అందించడంలో ఎదురవుతున్న సమస్యలపై స్థానిక పశువైద్యాధికారి తుమ్మల కృష్ణను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణం, చుట్టూ ప్రహరీ కోసం టెండర్ల దశలో ఉందని, త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా శంకుస్థాపన ఉంటుందని పురంధర్‌కు వివరించినట్లు తెలిసింది.

➡ **కొనసాగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక**

నేలకొండపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చెందిన సామాజిక తనిఖీ నివేదికలపై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి 31, మార్చి 2015 వరకు జరిగిన పనులపై గ్రామాల వారీగా తనిఖీ నిర్వహించారు. కాగా, సభలో 11 జీపీలు నివేదికలు పూర్తి చేయగా.. మిగతా వాటికోసం గురువారం వరకు ప్రజావేదిక జరుగుతుందని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శిరీష తెలిపారు.పలు పంచాయతీలకు చెందిన కొంతమంది అవకతవకలు జరిగినట్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీదేవి, అంబుడ్స్‌మెన్ రమేష్, డీవీఓ సక్రియ, ఏవీఓ పవన్, వీరయ్య, ఎస్‌ఆర్‌పీ చెన్నకేశవ్‌లు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ శివ, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఈసీ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

➡ **హుండీ పగలగొట్టి చోరీ**

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. నిందితులు ఆలయ ఆవరణలోని హుండీ ఎత్తుకెళ్లి పగలకొట్టాక నగదు తీసుకుని వదిలేశారు. ఘటనపై ఆలయ నిర్వాహకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

➡ **రైతులకు, వ్యవసాయ శాఖకు ఆత్మ కమిటీ వారధి**

ఖమ్మంవ్యవసాయం: రైతులకు, వ్యవసాయ శాఖకు ఆత్మ కమిటీ వారధిగా వ్యవహరిస్తుందని ఖమ్మం డివిజన్ ఆత్మ బ్లాక్ ఫార్మర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ దిరిశాల చిన వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని డివిజన్ వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరిలో వెదజల్లే పద్ధతుల ద్వారా పెట్టుబడులు తగ్గుతున్నాయని, నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగుపై రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారులు కిషోర్‌బాబు, తారాదేవి, ఉమామహేశ్వరరెడ్డి, సాంకేతిక వ్యవసాయాధికారి నారాయణరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

➡ **'రెజొనెన్స్ శ్రీనివాసనగర్' విద్యార్థుల ప్రతిభ**



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం సహకారనగర్: సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు జి.జస్మిత బ్రౌన్, కె.రేష్మ మహి, నిర్వాన్ జోష్ బంగారు పతకాలు సాధించారని రెజొనెన్స్‌శ్రీనివాసనగర్ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

➡ **మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన**

ఖమ్మంమయూరిసెంటర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు మాట్లాడుతూ.. వంట కార్మికులకు సకాలంలో బిల్లులు అందించకుండా అరకొరగా పెరిగిన మెస్ చార్జీలతో విద్యార్థులకు పోషక ఆహారం ఎలా అందించడం సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దండు ఆదినారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గుండెపంగు మల్లేష్, నాయకులు పిల్లి భాస్కర్, రామారావు, నాగరాజు, రంజాన్బీ పాల్గొన్నారు.